
సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



ప్రజాతీర్పును గౌరవిస్తా..
ప్రజాతీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్ర పక్కాగా పోషిస్తానని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 9లో



టార్పాలిన్లు అందించరూ!
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. - 9లో



హైవేపై హాహాకారాలు
నల్లగొండ పట్టణ శివారులో ఆదివారం అర్ధరాత్రి ఓ ప్రైవేట్ బస్సులో మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. - 10లో

న్యూస్‌రీల్

కేసీఆర్ దత్తత గ్రామంలో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ

తుర్కపల్లి : కేసీఆర్ దత్తత తీసుకున్న తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిలో బీఆర్‌ఎస్ పార్టీకి 77 ఓట్ల మెజార్టీ దక్కింది. గ్రామంలో 49, 50 రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.49వ బూత్‌లో 344, 50వ బూత్‌లో 181 ఓట్లు బీఆర్‌ఎస్‌కు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీకి 49వ బూత్‌లో 293, బూత్ నంబర్ 50లో 155 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 49 బూత్‌లో 152 ఓట్లు, 50వ బూత్‌లో 67 ఓట్లు పోలయ్యాయి.

పోచంపల్లి వాసికి బెస్ట్ హ్యాండ్లూమ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న యుగేందర్

భూదాన్‌పోచంపల్లి : సృజనాత్మకత, నూతన డిజైన్లతో చేనేత వస్త్రాల తయారీ, ఉత్తమ మార్కెటింగ్, ఆన్‌లైన్ విక్రయాలు చేపడుతున్న భూదాన్‌పోచంపల్లికి చెందిన ఇక్కత్ వరల్డ్ అధినేత గంజి యుగేందర్ ఆసియా బెస్ట్ హ్యాండ్లూమ్ అవార్డు అందుకున్నారు. ఈ నెల 3న తమిళనాడులోని తిరుచిరావలిలో ఆసియా అవార్డు సంస్థ నిర్వహించిన బిజినెస్ అవార్డు వేడుకల్లో ఆయన అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి భారత్‌తో పాటు శ్రీలంక, భూటాన్, మలేషియా, నేపాల్, కెన్యా, మల్దీవులు, మారిషస్ దేశాల నుంచి వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గంజి యుగేందర్ మాట్లాడుతూ అవార్డు వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. తన ఉన్నతికి, అవార్డు రావడానికి సహకరించిన చేనేత కళాకారులు, వినియోగదారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

మహాశివుడికి అభిషేకాలు



పూజలు చేస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు ఘనంగా నిర్వహించారు. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. అదే విధంగా శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన ఉర్సు



దర్గాలో పూలచాదర్ సమర్పిస్తున్న భక్తులు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని దర్గాల్లో వారం రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు సోమవారం ముగిశాయి. దర్గా కమిటీ సభ్యులు ఉపవాస దీక్ష విరమించి దర్గాలో పూల చాదర్ సమర్పించారు. ఉర్సుకు జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఉజలేషా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

10న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

భువనగిరి : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఈ నెల 10వ తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభంకానుంది. విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. రిజిస్టర్ చేసుకున్న యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలన్నారు.

యాదాద్రిలో కార్తీక దీపారాధన



యాదగిరిగుట్ట : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం భక్తులు దీపారాధనలు చేశారు. అదే విధంగా సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. సత్యనారాయణస్వామి వ్రతాల ద్వారా రూ.4,68,800, ప్రధానాలయంలో నిర్వహించిన నిత్య కైంకర్యాల వల్ల నిత్యాదాయం రూ.31,98,254 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

యాదాద్రి కొండపై దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఇద్దరు సీనియర్లకు చాన్స్!

ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులు!
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌లకు అవకాశం
- సామాజిక సమీకరణల ఆధారంగా మరొకరికి కూడా..
- లంబాడా సామాజికవర్గం నుంచి బాలునాయక్ పేరు పరిశీలన!



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కొత్తగా ఏర్పడబోయే రాష్ట్ర మంత్రివర్గంలో జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలకు రెండు మంత్రి పదవులు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లు ప్రతిపక్షంలో ఉన్నా ఉమ్మడి జిల్లాలో తమదైన ముద్రవేసిన కీలక నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవులు దక్కే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు సామాజిక సమీకరణల ఆధారంగా జిల్లాకు మరో పదవి కూడా దక్కే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ములుగు నుంచి గెలుపొందిన ఆదివాసి గిరిజనురాలైన సీతక్కకు క్యాబినెట్‌లో అవకాశం కల్పిస్తే, లంబాడా సామాజిక వర్గం నుంచి దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు చాన్స్ రావచ్చన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది.

ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా సీనియర్లే..

నాగార్జునసాగర్‌లో, అంతకుముందు 2009లో రద్దయిన చలకుర్తి నియోజకవర్గం నుంచి మొత్తంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సీనియర్ నేత కుందూరు జానారెడ్డి ఈసారి పోటీ చేయలేదు. ఆయన గతంలో హోంశాఖ మంత్రిగానే కాకుండా 12 శాఖలకు మంత్రిగా పనిచేశారు. అయితే ప్రస్తుతం ఆయన పోటీ నుంచి తప్పుకొని తన కుమారుడు కుందూరు జయవీర్‌రెడ్డి అవకాశం ఇచ్చారు. సూర్యాపేట నుంచి ప్రస్తుతం పోటీ చేసి ఓడిపోయిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి గతంలో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు, సూర్యాపేట నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మరోవైపు హుజూర్‌నగర్‌లో మూడు పర్యాయాలు, కోదాడలో రెండుసార్లు మొత్తంగా ఇప్పటికే ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు హుజూర్‌నగర్‌నుంచి ఆరోసారి గెలుపొందారు. ఇక నల్లగొండ నియోజకవర్గం నుంచి ఇప్పటికే నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పుడు ఐదోసారి నల్లగొండ నుంచే గెలుపొందారు.

ఉమ్మడి జిల్లాలో పార్టీని నడిపిన నేతలు

ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అసెంబ్లీ 12 నియోజక వర్గాలకు గాను 11 స్థానాల్లో కాంగ్రెస్ విజయభేరి మోగించింది. అయితే, గత పది సంవత్సరాలుగా జిల్లాలో పార్టీ ఉనికికి ప్రమాదం రాకుండా సీనియర్ నాయకులు కీలకంగా వ్యవహరించారు. 2018 శాసనసభ ఎన్నికల తరువాత జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలను కూడా కోల్పోయినా, 2019 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి రెండు పార్లమెంట్ స్థానాలను దక్కించుకొని పార్టీని కాపాడుకుంటూ వచ్చారు. సీనియర్ నేతలు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో పాటు భువనగిరి ఎంపీగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణుల్లో ఎప్పటికప్పుడు ధైర్యం నింపుతూ అండగా నిలిచారు.

వీరంతా ఇన్నాళ్లు జిల్లాలో పార్టీ పట్టు కోల్పోకుండా కాపాడటంలో కీలకంగా వ్యవహరించారు. ఇలా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు నలుగురైదుగురు ఉండగా, అందులో ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా గెలుపొందిన నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గతంలో మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గృహ నిర్మాణ శాఖ మంత్రిగా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఐటీ శాఖ మంత్రిగా సేవలందించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ఈ ఇద్దరికి మంత్రి పదవులు దక్కుతాయన్న నమ్మకంతో పార్టీ శ్రేణులు ఉన్నాయి.

రెండోసారి గెలుపొందిన ముగ్గురు

ఈ ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేశారు. కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, దేవరకొండ నుంచి బాలూనాయక్ కూడా రెండోసారి విజయం సాధించారు. మిగిలిన ఎమ్మెల్యేలు అందరూ కాంగ్రెస్‌లో జూనియర్‌లే.

ఉద్యమ పార్టీకి ఆదరణ తగ్గింది

- ఉమ్మడి జిల్లాలో మొన్నటి వరకు 12 స్థానాలు బీఆర్‌ఎస్‌వే..
- తాజా ఎన్నికల్లో ఒక్క సీటుకే పరిమితం
- 2004లో ఆలేరులో మాత్రమే గెలుపు
- క్రమంగా పుంజుకుని.. మళ్లీ చతికిలపడిన గులాబీ పార్టీ



సాక్షి, యాదాద్రి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు పక్కన బెట్టి కాంగ్రెస్‌కు జైకొట్టారు. 2004 ఎన్నికల్లో మాదిరిగానే ప్రస్తుత ఎన్నికల్లో గులాబీ పార్టీ నుంచి ఒక్కరే విజయం సాధించారు. అప్పటి ఎన్నికల్లో ఆలేరు నుంచి నగేష్ గెలుపొందగా.. తాజా ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాత్రమే విజయం సాధించారు. మిగతా 11 మంది పరాజయం పాలయ్యారు.

ప్రస్థానం ఇలా..

2001లో ఏర్పడిన టీఆర్‌ఎస్‌ను 2004, 2009 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు అంతంగా ఆదరించలేదు. ఆ మధ్యకాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నిల్లో మాత్రం చాలాచోట్ల విజయం సాధించింది. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో, 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో ఒక్క ఆలేరు నియోజకవర్గంలోనే టీఆర్‌ఎస్ విజయం సాధించింది. 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పుంజుకుంది. 12 అసెంబ్లీ స్థానాలగాకు గాను 6 అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. భువనగిరి పార్లమెంట్ స్థానంతో పాటు భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీఆర్‌ఎస్ ఘన విజయం సాధించింది.

2004లో నగేష్ ఒక్కరే విజయం


తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో టీఆర్‌ఎస్ కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకుని 2004 ఎన్నికల్లో బరిలోకి దిగింది. ఆలేరులో టీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన డాక్టర్ నగేష్ టీడీపీ అభ్యర్థి మోత్కుపల్లి నర్సింహులుపై విజయం సాధించారు. అదే ఎన్నికల్లో భువనగిరి నుంచి బరిలోకి దిగిన టీఆర్‌ఎస్ అభ్యర్థి ఆలె నరేంద్ర.. టీడీపీ అభ్యర్థి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. నకిరేకల్‌లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన డాక్టర్ చెరుకు సుధాకర్ ఓటమిపాలయ్యారు. కాగా, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2008లో కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆలేరు ఎమ్మెల్యే డాక్టర్ నగేష్ రాజీనామా చేశారు. వెంటనే జరిగిన ఉప ఎన్నికలో మరోసారి నగేష్ విజయం సాధించారు. 2009 నాటికి పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. ఆ ఎన్నికల్లో మూడు స్థానాలకు పోటీచేసిన టీఆర్‌ఎస్ ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. టీడీపీ, వామపక్షాలతో కలిసి మహాకూటమి పేరుతో ఆలేరు, సూర్యాపేట, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో టీఆర్‌ఎస్ పోటీ చేసింది. ఆలేరులో టీఆర్‌ఎస్ అభ్యర్థి కళ్లెం యాదగిరిరెడ్డి ఓటమి పాలయ్యారు. హుజూర్‌నగర్‌లో గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, సూర్యాపేటలో పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరాజయం పొందారు.

2018లో తొమ్మిది నుంచి 12 స్థానాలకు..

2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య తొమ్మిదికి పెరిగింది. మునుగోడు, నకిరేకల్, హుజూర్‌నగర్‌లో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. అయితే, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. హుజూర్‌నగర్ నుంచి గెలిచిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి బరిలో నిలిచారు. ఎంపీగా విజయం సాధించడంతో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో హుజూర్‌నగర్‌కు వచ్చిన ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ తరఫున శానంపూడి సైదిరెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. దీంతోపాటు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య ఆకస్మిక మరణంతో వచ్చిన ఉప ఎన్నికలో ఆయన తనయుడు నోముల భగత్ బీఆర్‌ఎస్ నుంచి పోటీలో నిలిచి గెలుపొందారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో వచ్చిన ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి ప్రజలు పట్టంకట్టారు. జిల్లా మొత్తంలో 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ తరఫున శాసనసభలో ప్రాతినిధ్యం వహించారు.

ఆర్డీఆర్‌కు మరోసారి అపజయం

- వరుసగా మూడు పర్యాయాలు పోటీ చేసినా ఓటమే..
- 2009లో ఒక్కసారి మాత్రమే వరించిన విజయం
- కాంగ్రెస్ 'వేవ్'లోనూ దక్కని గెలుపు



సూర్యాపేట: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి సూర్యాపేట కలిసి రావడం లేదన్న చర్చ జరుగుతోంది. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా హస్తం హవా కొనసాగిన తరుణంలో సూర్యాపేటలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. తుంగతుర్తిలో 1985 నుంచి వరుసగా మూడుసార్లు.. 2004లో మరోసారి.. ఇలా మొత్తం నాలుగు పర్యాయాలు విజయం సాధించిన దామోదర్‌రెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లభించింది. రాష్ట్ర మంత్రిగా కూడా రెండుసార్లు పనిచేశారు. తుంగతుర్తి ఎస్సీ రిజర్వ్‌డ్, సూర్యాపేట జనరల్ స్థానం అయ్యింది.దీంతో 2009 లో సూర్యాపేట నుంచి మొట్టమొదటిసారి పోటీ చేసి విజయబావుటా ఎగరవేశారు. కానీ ఆ తర్వాత వరుసగా జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు అపజయం పాలయ్యారు. మూడుసార్లు విజయానికి చేరువగా వచ్చి ఓటమి పాలు కావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు నైరాశ్యంలో ఉన్నారు. మరీ ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రానుండడం.. గెలిస్తే మంత్రి పదవి కూడా వచ్చే అవకాశం ఉన్న పరిస్థితుల్లో ఆర్డీఆర్ ఓడిపోవడంతో ఢీలా పడ్డట్లయింది. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా త్రిముఖపోటీ ఉండి బీజేపీ అభ్యర్థులు బలంగా ఓట్లు చీల్చుకున్న దగ్గర కాంగ్రెస్ పార్టీ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయింది.. ఇక్కడ కూడా అదే జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ ఈసారి ఓటర్లను సరిగా అంచనా వేయలేకపోవడంతో ఓటమిని చవిచూసినట్లు చర్చించుకుంటున్నారు.

'సంకినేని'ని ఆదరించని సూర్యాపేట

- మూడు సార్లు పోటీ చేసినా చేకూరని విజయం



సూర్యాపేట: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావుకు సూర్యాపేట ఈ సారైనా ఎంట్రీ ఇస్తుందని భావించిన ఆయన అభిమానులకు ఊరట దక్కలేదు. ఈ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. సంకినేని 1999లో తుంగతుర్తిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డిపై విజయం సాధించడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత 2004లో ఓడిపోయినప్పటికీ జనరల్ నియోజకవర్గమైన సూర్యాపేటలో పాగా వేద్దామనుకుంటే నాటి నుంచి నేటి వరకు ఆశ నెరవేరడంలేదు. 2009లో పోటీచేసేందుకు చివరి దాకా ప్రయత్నం చేయగా మహాకూటమి పొత్తులో భాగంగా టీఆర్‌ఎస్‌కు కేటాయించడంతో పోటీ నుంచి విరమించుకున్నారు. 2014లో అయినా పోటీ చేసి గెలుద్దామనుకుని బీజేపీలో చేరగా.. బీజేపీ, టీడీపీ పొత్తులో టీడీపీకి టికెట్ కేటాయించారు. దీంతో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగగా.. పెద్ద ఎత్తున సానుభూతి లభించి గెలుపు అంచుల దాకా వచ్చి బీఆర్‌ఎస్ అభ్యర్థి జగదీష్‌రెడ్డి చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2018, 2023లో కూడా గెలుపు దిశగా పావులు కదిపినా ఫలితం దక్కలేదు.

10 చోట్ల బీజేపీకి డిపాజిట్ గల్లంతు

- సూర్యాపేటలో కాస్త పోటీ ఇచ్చిన సంకినేని
- 8 చోట్ల మూడో స్థానం, మూడు చోట్ల 4వ స్థానం
- కోదాడలో ప్రభావం చూపని జనసేన



బీజేపీ అభ్యర్థులు సాధించిన ఓట్లు

అభ్యర్థి పేరు	స్థానం	వచ్చిన ఓట్లు
మాదగాని శ్రీనివాస్‌గౌడ్	నల్లగొండ	7,828
గూడూరు నారాయణరెడ్డి	భువనగిరి	9,063
కేతావత్ లాలూనాయక్	దేవరకొండ	9,735
చల్లా శ్రీలత	హుజూర్‌నగర్	3,715
సాధినేని శ్రీనివాసరావు	మిర్యాలగూడ	3,042
నకిరేకంటి మొగులయ్య	నకిరేకల్	5,668
చలమల్ల కృష్ణారెడ్డి	మునుగోడు	22,319
పడాల శ్రీనివాస్	ఆలేరు	9,659
కంకణాల నివేదిత	నాగార్జునసాగర్	6,491
సంకినేని వెంకటేశ్వర్‌రావు	సూర్యాపేట	40,407
కడియం రాంచంద్రయ్య	తుంగతుర్తి	4,412

నల్లగొండ టూటౌన్: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీజేపీ ఘోరపరాజయం పాలైంది. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 11 చోట్ల బీజేపీ అభ్యర్థులు పోటీ చేయగా, పొత్తులో భాగంగా కోదాడ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించారు. కేవలం సూర్యాపేటలో మాత్రమే చెప్పుకోదగ్గ ఓట్లను రాబట్టి కాస్త పరువు నిలుపుకుంది. ఇక్కడ పోటీ చేసిన సంకినేని వెంకటేశ్వరావు 40,407 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. ఇక మిగతా 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కమలం పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతయ్యాయి. దీంతో కమలం పార్టీ శ్రేణులు నిరాశలో మునిగిపోయాయి. నల్లగొండలో మాదగాని శ్రీనివాస్‌గౌడ్, హుజూర్‌నగర్‌లో చల్లా శ్రీలత, మిర్యాలగూడలో సాధినేని శ్రీనివాసరావు నాలుగో స్థానానికి దిగజారగా, మిగతా వారు మూడవ స్థానంతో సరిపెట్టుకున్నారు. కాగా పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి సతీమణి నివేదిత సాగర్‌లో ఏ మాత్రం ప్రభావం చూపలేదు.

మూడు సభల్లో అమిత్‌షా పాల్గొన్నా..

అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుతామని అనుకున్న ఆ పార్టీకి 10 చోట్ల డిపాజిట్లు కూడా రాకపోవడంతో బొక్క బోర్లా పడింది. ఎస్సీ వర్గీకరణ, బీసీ సీఎం వంటి హామీలు కలిసి వస్తాయనుకున్నా నిరాశే మిగిలింది. నల్లగొండ, సూర్యాపేట, చౌటుప్పల్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో బహిరంగ సభలు నిర్వహించారు. ఈ మూడు చోట్ల కేవలం సూర్యాపేటలో మాత్రమే 40 వేలకుపైగా ఓట్లు వచ్చాయి. మరో కేంద్ర సహాయ మంత్రి శోభాకరంద్లాజే నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడలో పర్యటించి ప్రచారం చేసినా బీజేపీ అభ్యర్థులకు ఆశించిన ఫలితాలు రాలేదు.

జనసేనను ఆదరించని జనం

పవన కళ్యాణ్ పార్టీ జనసేన నుంచి కోదాడలో పోటీ చేసిన మేకల సతీష్‌రెడ్డిని జనం ఆదరించలేదు. ఆయన కేవలం 1,696 ఓట్లు మాత్రమే సాధించి 4వ స్థానానికి పరిమితమయ్యారు.

రైతుబంధు సమితి నల్లగొండ అధ్యక్షుడు రాజీనామా



శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్ : బీఆర్‌ఎస్ నాయకుడు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషనర్, సెక్రటరీ రఘునందన్‌రావుకు పంపినట్లు సోమవారం తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో చోటుచేసుకుంటున్న పరిణామాలతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. జిల్లా రైతుబంధు అధ్యక్షుడి హోదాలో అన్నదాతలకు సేవచేసే అవకాశం లభించినందుకు ఎంతో గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

ఉనికి చాటుకోని కామ్రేడ్లు

- 1994లో సీపీఐ, సీపీఎం చెరో మూడు స్థానాల్లో గెలుపు
- నేడు డిపాజిట్ కూడా దక్కించుకోని సీపీఎం అభ్యర్థులు

నల్లగొండ టౌన్: విప్లవాల ఖిలా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నేడు కామ్రేడ్లు తమ ఉనికిని చాటుకోలేకపోయారు. జిల్లాలోని 12 స్థానాలకు గాను సీపీఎం 7 స్థానాల్లో పోటీ చేయగా ప్రస్తుతం వెలువడిన ఫలితాల్లో వారికి కనీసం డిపాజిట్ దక్కలేదు. సీపీఐ మాత్రం ఎక్కడా పోటీ చేయకుండా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపింది. అయితే 1994లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీపీఎం 3, సీపీఐ 3 అసెంబ్లీ స్థానాల్లో గెలిచాయి. 2004 ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ చెరో 2 స్థానాలను కైవసం చేసుకున్నాయి. 2009 ఎన్నికల్లో సీపీఐ మునుగోడులో, సీపీఎం మిర్యాలగూడలో గెలిచాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ దేవరకొండలో గెలవగా, సీపీఎం ఒక్క స్థానం కూడా గెలవలేదు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో మిర్యాలగూడ నుంచి సీపీఎం సీనియర్ నేత జూలకంటి రంగారెడ్డి బరిలో నిలవగా 3,234 ఓట్లు వచ్చాయి. నల్ల గొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డికి కేవలం 1,439 ఓట్లు వచ్చాయి. నకిరేకల్ నుంచి బరిలో నిలిచిన బొజ్జ చిన వెంకులుకు 3,238 ఓట్లు, భువనగిరి నుంచి పోటీలో ఉన్న కొండమడుగు నర్సింహకు 1,303 ఓట్లు వచ్చాయి. ఇక, హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసిన ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మికి 1,914 ఓట్లు వచ్చాయి. మునుగోడు నుంచి దోనూరి నర్సిరెడ్డికి 2,351, కోదాడ బరిలో నిలిచిన మట్టపల్లి సైదులుకు 1,187 ఓట్లు వచ్చాయి. దీంతో సీపీఎం అభ్యర్థులకు ఎక్కడ కూడా డిపాజిట్ దక్కని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉన్నప్పటికీ రానురాను ఉనికిని కోల్పోతున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

విద్యార్థుల హాజరులో పారదర్శకత

- ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం ద్వారా హాజరు నమోదు

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదులో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 11న జిల్లా వ్యాప్తంగా ప్రారంభించిన ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం) హాజరు విధానం జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. ప్రతి రోజూ ప్రత్యేక యాప్ ద్వారా విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారు. ఈ విధానం వల్ల విద్యార్థుల సంఖ్య అధికంగా చూపించడానికి వీలుండదు. మధ్యాహ్న భోజనం, అల్పాహారం, యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీలో లెక్క పక్కాగా ఉంటుంది. ఎన్నికలు ముగియడంతో ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. జిల్లాలో 712 పాఠశాలలు, 55,245 మంది విద్యార్థులు ఉన్నారు.



క్లుప్తంగా

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు

రాజాపేట: మండల పరిధిలోని పుట్టగూడెం గ్రామ పంచాయతీకి చెందిన జూనియర్ లైన్ మన్ ఫారూక్ సోమవారం గ్రామంలో విధులు నిర్వహిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గ్రామంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోగా విద్యుత్ స్తంభం ఎక్కి ఫ్యూజ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఫారూక్ ఎడమ చేయి పూర్తిగా కాలిపోవడంతో గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబద్‌లోని యశోదా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమకారుడు మృతి


కాకి చంద్రారెడ్డి (ఫైల్)

మోతె: మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన తెలంగాణ మలి ఉద్యమకారుడు కాకి చంద్రారెడ్డి(85) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. 2000 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొన్నారు. ఇప్పటికీ బీఆర్‌ఎస్‌లోనే ఉంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న ఆయన కొద్దిరోజుల నుంచి అనారోగ్యం బారిన పడి మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలువురు ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాకి చంద్రారెడ్డి భౌతికకాయాకి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


దశరథ (ఫైల్)

వలిగొండ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం నాగారం గ్రామ పంచాయతీకి చెందిన గోర్ల దశరథ (49) పని నిమిత్తం ఆదివారం బైక్‌పై సమీప గొల్లేపల్లి గ్రామానికి వెళ్లాడు. అక్కడ పని ముగిసిన తర్వాత తిరిగి వస్తుండగా గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దశరథ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

సామాజిక సేవలో శ్రీ సాయిధామం

- పేద విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తూ చేయూత

బొమ్మలరామారం: మండల పరిదిలోని పెద్ద పర్వతాపూర్ గ్రామంలో గల శ్రీ సాయిధామం ఆశ్రమ పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా ప్రతి సంవత్సరం సుమారుగా 300 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తూ చేయూతనిస్తోంది. ఈ పాఠశాలలో విద్యతో పాటు దేశభక్తి, దైవభక్తి, కుటుంబ విలువలు, యోగా, క్రీడలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుండడంతో మెరుగైన ఫలితాలు సాధిస్తుంది.

నెరవేరుతున్న ప్రభూజీ సంకల్పం..

శ్రీ సాయిధామం వ్యవస్థాపకుడు శ్రీ సత్యపదానంద ప్రభూజీ పేద పిల్లలకు విద్య భారం కాకూడదనే ఉద్దేశంతో 1993లో ఉచిత ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఈ ఏడాదితో ఈ పాఠశాల ప్రారంభమై 30 ఏళ్లు పూర్తవుతోంది. గత 25 ఏళ్లుగా ఈ పాఠశాల పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తుంది. 7 సంవత్సరాల క్రితం సత్యపదనంద ప్రభూజీ కాలం చేసినా ఆయన సంకల్పానికి అడ్డంకులు రాకుండా ప్రస్తుత ఆశ్రమ పీఠాధిపతి రామానంద ప్రభూజీ పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ ప్రభూజీ ఆశయాన్ని తూ.చ. తప్పకుండా పాటిస్తున్నారు.


శ్రీ సాయిధామం ఆశ్రమ పాఠశాల


పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

ఆశ్రమంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు

సాయిధామం ఆశ్రమంలో 1 నుంచి 10వ తరగతి వరకు ఉచిత విద్యతో పాటు యోగా సాధన, నేచురోపతి ఆరోగ్య కేంద్రం, నిత్యాన్నదానం, హిందూ పండుగలు, పర్వదినాలు, విశిష్ట రోజుల్లో యజ్ఞ హోమాదుల నిర్వహణ, గోసంరక్షణ కోసం గోశాల నిర్వహణ, అమవాస్య రోజున గోపూజ, బొమ్మలరామారం మండల పరిధిలోని గ్రామాలల్లో హిందూ ధార్మిక ప్రచార కార్యక్రమాలు, సాయి వాణి మాస పత్రిక నిర్వహణ జరుగుతుంది.

పేద పిల్లలకు భారం కావొద్దని..



పేద పిల్లలకు చదవు భారం కావొద్దనే ఆశ్రమ వ్యవస్థాపకుడు సత్యపదానంద ప్రభూజీ ఆశయాన్ని కొనసాగిస్తున్నాం. చదువుతోనే మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఆశ్రమ భక్తులు, శ్రేయోభిలాషుల సహకారంతో ఉచిత విద్యను అందిస్తున్నాం. దేశభక్తితో పాటు దైవభక్తిని విద్యార్థులకు నేర్పించి విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాం. పేద విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తున్నా.

– రామానంద ప్రభూజీ, ఆశ్రమ పీఠాధిపతి

ఎంతో తృప్తిగా అనిపిస్తుంది



ఈ పాఠశాలలోనే 18 సంవత్సరాలుగా ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్నా. 25 సంవత్సరాలుగా 10వ తరగతలో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ ఉద్యోగం నా బాధ్యతగా భావిస్తూ సమాజ సేవలో భాగస్వామిని అవుతున్నా. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నందుకు సంతృప్తిగా ఉంది.

– జ్యోతి, పాఠశాల ప్రిన్సిపాల్

ఇక్కడే చదివి.. పనిచేస్తున్నా



సాయిధామం ఆశ్రమ పాఠశాలలోనే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివాను. బీఈడీ పూర్తి చేసి ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నా. పేద పిల్లలు చదువుకు దూరం కావొద్దనే సాయిధామం ఆశ్రమ పాఠశాల లక్ష్యంలో పాలు పంచుకుంటున్నాను. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులతో విద్యార్థులు చదవుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

– సాయి గీత, ఉపాధ్యాయురాలు

కార్పొరేట్ కంటే మంచిగా ఉంది



సాయిధామం స్కూల్‌లో 1వ తరగతి నుంచి చదవుతున్నాను. కార్పొరేట్ స్కూళ్ల కంటే మంచిగా చదువు చెబుతున్నారు. విద్యతో యోగా, భక్తి, హిందూ సంస్కృతి సాంప్రదాయాలు, సమాజంలో పెద్దల పట్ల గౌరవ మర్యాదలు నేర్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో చదవడంతో మంచి మార్కులు వస్తున్నాయి.

– అమూల్య, యావపూర్ తండా, 10వ తరగతి

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


మౌనిక మృతదేహం

నల్లబెల్లి(వరంగల్): భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సైనాల నగేష్ తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని చిన్ననెమలి గ్రామ పంచాయతీకి చెందిన సూరినేని లక్ష్మి–సోమేశ్వర్‌రావు దంపతుల కుమార్తె మౌనిక(30), వరంగల్ నల్లబెల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పురం సారంగపాణి 14 ఏళ్ల క్రితం ప్రేమించుకుని కులాంతర వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లు వీరి దాంపత్య జీవితం సజావుగానే సాగింది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. కాగా, ఇటీవల సారంగపాణి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని భార్యను తరుచూ వేధిస్తున్నాడు. ఈ విషయమై పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి సారంగపాణిని మందలించారు. అయినా అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మరోమారు భార్యతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన మౌనిక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సామగ్రి ధ్వంసం.. కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజు మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు క్యాంపు కార్యాలయంలోకి వెళ్లి కేసీఆర్ ఫొటోలను ధ్వంసం చేసిన ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు మిర్యాలగూడ టూటౌన్ ఎస్ఐ క్రిష్ణయ్య సోమవారం తెలిపారు. క్యాంపు కార్యాలయంలో సహాయకుడిగా పనిచేస్తున్న పగడాల శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. కాగా ఎన్నికల కోడ్ ఉల్లఘించి ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు మేకల శ్రీనివాస్, కౌన్సిలర్ గంధం రామకృష్ణతో పాటు మరికొందరిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మేళ్లచెరువు శివాలయంలో కార్తీక పూజలు

మేళ్లచెరువు: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, ఆశీర్వచనాలు, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడు ప్రత్యేక పూజలు

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలక మండలి సభ్యుడు సాముల రాంరెడ్డి సోమవారం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం ఆయనకు ఆలయ ఈఓ కొండారెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

రెండు బైక్‌లు ఢీ.. యువకుడు దుర్మరణం


విక్రం (ఫైల్)

చౌటుప్పల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామానికి చెందిన మస్కు విక్రం(20) చౌటుప్పల్‌లోని ఓ ఫొటో స్టూడియోలో పనిచేస్తున్నాడు. తన గ్రామానికే చెందిన మరో యువకుడు రమేష్‌తో కలిసి నిత్యం స్టూడియోకు వస్తుంటారు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి పని ముగించుకున్నాక ఇద్దరు యువకులు కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పంతంగి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లగానే ఎదురుగా అతివేగంగా వచ్చిన స్కూటీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. బైక్ నడుపుతున్న విక్రం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన మరో యువకుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. సీఐ ఎస్. దేవేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రిజర్వ్ ఈవీఎంల తరలింపు


ఈవీఎంలను తరలిస్తున్న సిబ్బంది

నకిరేకల్: నకిరేకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూంలో ఉన్న రిజర్వ్ ఈవీఎంలను సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌కు తరలించామని ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ప్రసాద్‌నాయక్ తెలిపారు. 116 వీవీ ప్యాట్‌లు, 77 సీయూ, 147 బీయూబాక్స్‌లను తరలించామని పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూరు(ఎం): తాటిచెట్టు పైనుంచి పడడంతో గీత కార్మికుడికి గాయాలయ్యాయి. వివరాలు.. సోమవారం ఆత్మకూరు మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన నోముల నర్సయ్యగౌడ్ తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాతు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మెజారిటీలో వీరేశం సరికొత్త రికార్డు

- ఉమ్మడి జిల్లాలో 1952 ఎన్నికల నుంచి ఇదే అత్యధిక మెజారిటీ



సాక్షి, యాదాద్రి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నకిరేకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే వేముల వీరేశం సరికొత్త రికార్డు నెలకొల్పారు. 1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో పరిశీలిస్తే వేముల వీరేశందే అత్యధిక మెజారిటీ. ఆదివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో వీరేశం తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యపై 68,839 ఓట్ల మెజార్టీ సాధించారు. 2000 సంవత్సరంలో భువనగిరి నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అప్పటి టీడీపీ అభ్యర్థి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి 46,485 ఓట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థి వెంకటేశ్వర్‌రెడ్డిపై గెలుపొందారు. 1994 సాధారణ ఎన్నికల్లో భువనగిరి నుంచే టీడీపీ అభ్యర్థి ఎలిమినేటి మాధవరెడ్డి 43,519 ఓట్ల మెజారిటీతో తన ప్రత్యర్థిపై గెలుపొందారు. ఆ రెండు రికార్డులను తాజాగా వేముల వీరేశం బ్రేక్ చేశారు.

నలుగురు పోటీ చేసిన తొలిసారే విజయం

సాక్షి, యాదాద్రి: ఈసారి శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన తొలిసారే నలుగురు అభ్యర్థులు విజయం సాధించారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. తమ సామాజిక సేవా కార్యక్రమాలతో మిర్యాలగూడ ఎమ్మెల్యేగా బత్తుల లక్ష్మారెడ్డి, ఆలేరు ఎమ్మెల్యేగా బీర్ల అయిలయ్య గెలుపొందారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కుమారుడు జైవీర్‌రెడ్డి నాగార్జునసాగర్‌లో విజయం సాధించగా.. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొని టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పనిచేసిన మందుల సామేల్ ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి తుంగతుర్తి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.

కన్నీళ్లు పెట్టుకున్న పైళ్ల శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: శాసనసభ ఎన్నికల్లో ఓడిపోవడంతో పైళ్ల శేఖర్‌రెడ్డి కన్నీళ్లు పెట్టుకున్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులుతో పాటు పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు శేఖర్‌రెడ్డిని పట్టుకుని బోరున విలపించారు. అనంతరం శేఖర్‌రెడ్డి తన కారులో కూర్చొని కన్నీరు పెట్టుకుంటూ హైదారాబాద్‌కు వెళ్లిపోయారు.


శేఖర్‌రెడ్డిని చూసి విలపిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

ఈసారి ఎన్నికల్లో 'నోటా'కు తగ్గిన ఓట్లు

కోదాడ: ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఓటరుకు ఎవరూ నచ్చకపోతే నోటా(నన్ ఆఫ్ ది ఎబోవ్)కు ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. 2018 ఎన్నికలతో పోలిస్తే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నోటాకు పడ్డ ఓట్లు తగ్గాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు హోరాహోరిగా తలపడడంతో నోటాకు పడ్డ ఓట్లు తగ్గాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 2014లో ఉమ్మడి జిల్లాలో నోటాకు 10,131 ఓట్లు పడగా, 2018లో మాత్రం నోటాకు ఏకంగా 17,766 ఓట్లు పడ్డాయి. 2023 ఎన్నికల్లో మాత్రం 11,297 ఓట్లు పడ్డాయి. 2018తో పోలిస్తే ఈసారి 6469 ఓట్లు తక్కువగా వచ్చాయి.

నియోజకవర్గం	2014	2018	2023
కోదాడ	621	1240	887
సూర్యాపేట	722	820	760
నల్లగొండ	493	1276	901
మునుగోడు	558	3080	849
భువనగిరి	962	1347	882
నకిరేకల్	1395	1331	969
తుంగతుర్తి	852	1392	1351
ఆలేరు	778	1464	659
మిర్యాలగూడ	957	1171	527
దేవరకొండ	1166	1695	1613
నాగార్జునసాగర్	775	1330	1056
హుజూర్‌నగర్	852	1620	843
మొత్తం	10,131	17,766	11,297

వందో వసంతంలో ఆత్మీయ సమ్మేళనం


నాలుగు తరాల కుటుంబ సభ్యులతో తత్తరి బాలమ్మ

బొమ్మలరామారం: మండలంలోని మర్యాల గ్రామానికి చెందిన తత్తరి కొండయ్య భార్య బాలమ్మ వంద ఏళ్లు పూర్తిచేసుకుంది. నేటికీ బాలమ్మ ఆరోగ్యవంతమైన జీవితం గడుపుతోంది.కొండయ్య–బాలమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ముగ్గురు కూమార్తెలు సంతానం. బాలమ్మ వంద వసంతాలు పూర్తిచేసుకోవడంతో సోమవారం 101 మంది కుటుంబ సభ్యులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఆమె తన కూమారులు, కుమార్తెలు, మనమళ్లు, మనవరాళ్లు, ముని మనమలు, ముని మనవరాళ్లతో ఆనందంగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంది.

వేదాంత విజ్ఞాన మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

అర్వపల్లి : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య పుణ్యక్షేత్రంలో మార్చి 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే 41వ వేదాంత విజ్ఞాన మహాసభలను విజయవంతం చేయాలని గంగాపురం శ్రీ మలయాళస్వామి లక్ష్మీ నారాయణ ఆశ్రమం పీఠాధిపతి పరమాత్మానంద గిరిస్వామి కోరారు. సోమవారం తిమ్మాపురంలోని సూర్యక్షేత్ర ఆవరణలో రామకోటి స్థూపం, కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయాల వద్ద మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు మహాసభలు జరుగుతాయని చెప్పారు. అలాగే 156వ విష్ణుసహస్రనామ సహిత శ్రీరామ అఖండ పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ మీలా మహాదేవ్, గుండా శ్రీనివాసులు, గుండా చంద్రశేఖర్, యాదగిరి, ప్రభాకర్, రమేష్, వెంకన్న, హరినాథ్, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, గణపురం నరేష్ తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపురంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆహ్వానితులు

మిరప కోతలో జాగ్రత్తలు తప్పనిసరి

- పెద్దవూర ఏఓ కె. సందీప్‌కుమార్

పాడి పంట

పెద్దవూర: మిరప పంటను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరప పంట ఇప్పుడిప్పుడే పండుగా మారుతుండటంతో రైతులు మిరప కాయలను కోసేందుకు సిద్ధమవుతున్నారు. మిరప కోత, ఆరబెట్టే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి కె. సందీప్‌కుమార్ తెలిపారు. మిరప కోత, ఆరబెట్టే సమంయలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

పంట మార్పిడి చేయాలి..

మిరప రైతులు ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నా నాణ్యత లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. సరైన సమయంలో కోతలు కోయక, కల్లాల్లో వర్షానికి, మంచుకు కాయలు తడిస్తే నాణ్యత తగ్గుతుంది. మార్కెట్లో ధరలు లేక ఎగుమతులకు పనికిరాక, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వంటి కారణాలతో రైతులు నష్టపోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడం, విచక్షణారహితంగా పురుగు మందులను పిచికారీ చేయడం, పండిన మిరప కాయలు ఎప్పటికప్పుడు తెంచకపోవడం వంటి కారణాలతో కాయ నాణ్యత లోపిస్తుంది.


మిరప కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఆరబెట్టడం ఇలా..

కొన్నిసార్లు కోతల సమయంలో వర్షాలు కురిస్తే సకాలంలో కోతలు జరగక కోసిన వాటిని సరైన సమయంలో ఎండబెట్టక పోవడంతో నాణ్యత లేని మిర్చిగా మారిపోతుంది. ఫలితంగా మార్కెట్లో కాయలకు సరైన ధర రాక నష్టపోవాల్సి వస్తుంది. మిరపకాయల్ని ఎండబెట్టే కల్లాల్ని గట్టి భూమి ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. దుమ్ము ఎక్కువగా లేని, కొద్దిగా ఏటవాలుగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. నీళ్లు వెళ్లే వైపు కల్లం పొడవుగా ఉండాలి. వర్షం పడినప్పుడు పైనీళ్లు కల్లం పైకి రాకుండా కల్లం చుట్టూ అడుగున్నర ఎత్తు కట్ట ఏర్పాటు చేసుకోవాలి. తోట విస్తీర్ణం, దిగుబడిని బట్టి కల్లం పొడవు, వెడల్పులను తయారు చేసుకోవాలి. వర్షాలు పడ్డప్పుడు పరదాలు కప్పుతాం కాబట్టి నీరు తీసివేయడానికి అనుకూలంగా ఉంటుంది. దాదాపు 10 క్వింటాళ్ల మిరపకు 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు గల కల్లం తయారు చేసుకోవాలి. కల్లం సైజును బట్టి టార్పాలిన్ కవరు తెచ్చుకోవాలి. ప్రతిరోజు కోసే కాయల్ని కుప్పలుగా పోసి మరుసటి రోజు ఉదయం మంచు తగ్గగానే పలుచగా పోసి ఆరబెట్టాలి. ప్రతిరోజు సాయంత్రం ఆరబెట్టిన మిరప కాయల్ని కుప్పగా పోసి టార్పాలిన్ కవర్ కప్పి కాయలపై మంచు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఇలా చేస్తే గాలి, వెలుతురు బాగా ప్రసరించి కాయలు త్వరగా ఎండుతాయి. కాయలు బాగా ఎండకముందే తెల్లకాయలు వేరుచేయాలి. కాయల్లో 5 శాతం తేమ ఉన్నప్పుడే వాటిని ఎండ పోసి గోనె సంచులతో కప్పాలి. మార్కెట్‌కు తీసుకెళ్లే రోజు ఉదయం శుభ్రమైన ఖాళీ సంచుల్లో వాటిని నింపాలి. ఒక్కో సంచిలో 40 కిలోల కాయల కన్నా ఎక్కువ నింపకూడదు. ఎక్కువ కాయల్ని సంచిలో తొక్కితే కాయ నాణ్యత చెడిపోయి మార్కెట్‌లో సరైన ధర రాదు. కోత సమయంలో ఈ విధమైన చర్యలు చేపడితే నాణ్యమైన పంటతో పాటు మార్కెట్లో అధిక ధర పలుకుతుంది.

కోత విధానం ఇలా..

మిరపతోటలో కొన్ని కాయలు పండిన వెంటనే కూలీలతో కోయిస్తే చెట్టు విరిగిపోయి తోటకు నష్టం కలుగుతుందని చాలామంది రైతులు భావిస్తున్నారు. చాలా కాయలు పండిన తర్వాత ఒకేసారి కోయవచ్చునని మరికొంత మంది రైతులు భావించి పంట కోతను ఆలస్యం చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో అకాల వర్షాలు కురిస్తే పండిన కాయలు చెట్టు నుంచి మొత్తం రాలిపోతాయి. మంచు వల్ల కూడా కాయలు రాలిపోయే అవకాశం ఉంది. ఒక్కోసారి తెల్లకాయలు ఎక్కువగా వస్తుంటాయి. మొక్కల ఎదుగుదల తగ్గుతుంది. అందువల్ల రైతులు తోటలో కోతకు వచ్చిన కాయల్ని విడతల వారీగా కోసి నాణ్యత గల కాయల్ని మార్కెట్‌కు పంపాలి. పండిన కాయల్ని వెంటనే కోస్తే తెల్లకాయలు ఎక్కువగా రావు. కాయకోత తరువాత ఎరువులు వేసి, నీటి తడి పెడితే అదనంగా మొక్కకు కాయ వచ్చి దిగుబడి పెరుగుతుంది. రైతులు కనీసం కాయలను ఆరు, ఏడు దఫాలుగా కోయాలి.